సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



ప్రతిభకు పురస్కారం
విధుల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులకు స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

- 8లో ▸



శుభకరం .. వరలక్ష్మీ వ్రతం
సకల సంపదలు ఇచ్చే వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.4 /24.5

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు



సదాశివనగర్: కరెంట్ కోతలను నిరసిస్తూ మండలంలోని పద్మాజీవాడి సబ్‌స్టేషన్‌ను గురువారం మోడెగాం గ్రామ రైతులు ముట్టడించారు. రాత్రి వేళ విద్యుత్ సరఫరా సక్రమంగా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఏఈ ధర్మారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. ఇక నుంచి కోతలు లేకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గొడెల్లి గంగాధర్, మచ్చర్ల రాజు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్సైకి ఇండియన్ మెడల్




కామారెడ్డి క్రైం: కామారెడ్డి పోలీసు శాఖలో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నీలం రెడ్డి ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపికయ్యారు. గురువారం రాష్ట్ర స్థాయిలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నీలంరెడ్డి మెడల్‌ను అందుకున్నారు. అతడిని ఎస్పీ సింధూశర్మ అభినందించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో


బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 4303 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మికాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 522 క్యూసెక్కుల నీరు పోతోంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో సమానంగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1081.10 (48.07 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

బల్దియా మాంసం దుకాణల అప్పగింత



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్‌లో 20 ఏళ్ల క్రితం మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మించిన మాంసం విక్రయాల సముదాయ దుకాణాలను ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు ఆరెకటిక సంఘం, మాంసం విక్రయదారులకు అప్పగించారు. దీంతో గురువారం సంఘం సభ్యులు సుభాష్‌రోడ్‌లో సంబురాలు జరుపుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మాంసం విక్రయించుకునేందుకు దుకాణాలను తమకు రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించేందుకు కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులకు 46వ వార్డు కౌన్సిలర్ కోయల్‌కర్ కన్నయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్, సురేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పెన్షనర్ల కార్యవర్గం ఏర్పాటు



కామారెడ్డి అర్బన్ : పెన్షనర్ల అసోసియేషన్ కామారెడ్డి జిల్లా శాఖను గురువారం అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు లచ్చయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ నర్సింగరావు పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా వి హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా జి శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా విజయరామరాజు, కార్యదర్శులుగా నర్సింహారెడ్డి, సత్తయ్య, రవీందర్, సత్యనారాయణ ఎన్నికయ్యారు.



రాష్ట్రంలో ప్రజాపాలన

- అభయహస్తం హామీలు అమలు చేస్తున్నాం
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన నడుస్తోందని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు స్వేచ్ఛ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం అందుబాటులో ఉండడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరు గ్యారంటీలను ఒక్కోటిగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 526 పంచాయతీలు, 80 పట్టణ వార్డుల్లో సదస్సులు నిర్వహించి గ్యారంటీలకు 2,94,799 దరఖాస్తులు, 13,367 ఇతర సమస్యల గురించి వినతులు స్వీకరించామన్నారు.

రైతులకు అండగా..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని రమేశ్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని 91,899 మంది రైతులకు రూ.655.37 కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు. మార్చిలో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన 9,107 మంది రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.10.32 కోట్లు పరిహారం అందజేశామని వెల్లడించారు. రైతునేస్తం కార్యక్రమం ద్వారా 25 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సు యూనిట్లను ఏర్పాటు చేశామని, దీని ద్వారా రైతులకు సాగుపై సూచనలు చేస్తున్నామని తెలిపారు. యాసంగిలో జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. అర్హత కలిగి ఉన్న రైతులకు రైతుబీమా అమలు చేస్తున్నామన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 761 చెరువుల్లో 2.83 కోట్ల చేపపిల్లలు విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం

జిల్లా కేంద్రంలో డయోగ్నస్టిక్ సెంటర్ నిర్మించి రూ.3.95 కోట్ల విలువైన రోగ నిర్ధారణ పరీక్షలు చేశామని చెప్పారు. ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

ధరణి సమస్యల పరిష్కారానికి చొరవ

జిల్లాలో 50,839 వివిధ రకాల ధరణి సమస్యలు పేరుకుపోగా ప్రభుత్వం 45,922 సమస్యలను పరిష్కరించిందన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 1.38 లక్షల మొక్కలు నాటామని తెలిపారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ, జిల్లా అటవీ అధికారి నిఖిత, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకంతో విద్యార్థి



జెండా వందనం చేస్తున్న టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, అధికారులు



మహిళలకు చేయూత

ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 1.80 కోట్ల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. బ్యాంకు లింకేజీ, ఇందిరా మహిళా శక్తి పథకాల ద్వారా మహిళలకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 1.56 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని వెల్లడించారు.

రోడ్లకు నిధులు

జిల్లాలో వర్షాలతో దెబ్బతిన్న 23 రోడ్ల మరమ్మతులకు రూ.60 కోట్లు, దెబ్బతిన్న 19 వంతెనాల పునర్నిర్మాణానికి రూ.42 కోట్లు మంజూరు చేయడంతో పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా పని ప్రదేశాల్లో ఉన్న 85 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించారన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 559 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించి, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు.

కొత్త రేషన్‌కార్డులకు కసరత్తు

ఆహార భద్రత పథకం ద్వారా 2.53 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డుల ద్వారా నెలకు 5,462 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నామని రమేశ్‌రెడ్డి తెలిపారు. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,42,957 మంది వినియోగదారులకు 2,48,316 గ్యాస్ సిలిండర్లు రూ.500కు అందజేశామన్నారు. చేయూత పథకం ద్వారా జిల్లాలో 1,65,670 మందికి ప్రతీ నెలా రూ.37.04 కోట్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథి రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్‌లను సందర్శించారు. జిల్లా సమాఖ్యకు మంజూరైన రూ.11.21 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.5 కోట్లు, రుణమాఫీ మూడో విడుత రూ.655.37 కోట్ల చెక్కులను అందజేశారు.





పాల్వంచ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రొటోకాల్ వివాదం

ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమ వేదికపై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ పార్టీ నేతలు సుభాష్‌రెడ్డి, పండ్ల రాజు, కౌన్సిలర్లు దాదాపు ఇరవై మంది వచ్చి కూర్చున్నారు. వేదికపై అధికార పార్టీ నేతలంతా వచ్చి కూర్చోవడంతో అధికారులు చర్చించుకుని వాళ్లను వేదికను ఖాళీ చేయాలని సూచించారు. కొందరు అలాగే కూర్చోవడంతో పోలీసు అధికారులు వెళ్లి సముదాయించి వేదికపై నుంచి పంపించారు.



వేదికపై చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ

మూడో విడతలో రూ.212.52 కోట్లు మాఫీ

- 17,543 మంది రైతులకు ప్రయోజనం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో మూడో విడతలో 17,543 మంది రైతులకు రూ.212.52 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. రూ.రెండు లక్షలలోపు ఉన్న రైతులకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడో విడత రుణమాఫీ నిధులను విడుదల చేశారు. తొలి విడతలో రూ.లక్ష లోపు, రెండో విడతలో రూ.లక్షన్నర లోపు రుణాలు మాఫీ చేసిన విషయం తెలిసిందే. మూడో విడతలో రూ.రెండు లక్షలలోపు రుణాలను గురువారం మాఫీ చేస్తూ అర్హులు, వారికి మాఫీ అయిన మొత్తానికి సంబంధించిన జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం మూడు విడతల్లో 91,899 మంది రైతులకు రూ.655.37 కోట్లు మాఫీ అయ్యాయి. రుణమాఫీ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాఫీ కాని రైతుల పరిస్థితి ఏమిటో..

మూడు విడతలో రుణమాఫీ కాని రైతుల పరిస్థితి ఏమిటన్నది తెలియాల్సి ఉంది. మాఫీ అవకాశం దొరకని రైతులు కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో తమ పేర్లను నమోదు చేయించుకుంటున్నారు. ఇప్పటికే మూడు వేల మందికి పైగా రైతులు తమకు మాఫీ రాకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. మూడు విడతల మాఫీ తర్వాత మిగిలిపోయిన వారికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

జిల్లాలో రుణమాఫీ వివరాలు

విడత	రైతులు	నిధులు(రూ.కోట్లలో)
మొదటి	49,540	231.13
రెండో	24,816	211.72
మూడో	17,543	212.52
మొత్తం	91,899	655.37

'పోచారం' నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఆర్డీవో ప్రభాకర్

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను గురువారం నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ ప్రారంభించారు. ప్రాజెక్టు గేట్ల వద్ద గంగమ్మతల్లికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం గేట్లను పైకి ఎత్తి నీటిని విడుదల చేశారు. పోచారం ఆయకట్టు పరిధిలో పంటలసాగు కోసం మొదటి విడతగా 100క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 15రోజులపాటు ప్రాజెక్టు నుంచి నీటివిడుదల కొనసాగనుంది. ఈ సందర్భంగా సీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ఆధునికీకరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.80టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.1టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఆయకట్టు పరిధిలో ఖరీఫ్ పంటలసాగు కోసం ప్రాజెక్టు నుంచి నాలుగు విడతలుగా నీటిని విడుదల చేస్తామన్నారు. గతేడాది పోచారం ప్రాజెక్టు అలుగు పైనుంచి 25టీఎంసీల నీరు పొంగి పొర్లిందన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 4టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన చెప్పారు. వర్షాలు పడకపోతే నిజాంసాగర్ ఆయకట్టు కింద వేసిన పంటల రక్షణ కోసం కొండపోచమ్మసాగర్ ద్వారా 2.5టీఎంసీల నీటిని నిజాంసాగర్‌లోకి తెప్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ విద్యావతి, డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీకాంత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు లక్ష్మణ్, ఇమామ్, రాంచందర్ రెడ్డి, వాసురెడ్డి, సామేల్, శ్రీనివాస్‌రెడ్డి, షౌకత్‌అలీ, గంగారెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి



బోర్లం మైనారిటీ పాఠశాలలో మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్/బాన్సువాడ: స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బాన్సువాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో, క్యాంపు కార్యాలయంలో, అంబేడ్కర్ చౌరస్తా వద్ద జెండా ఆవిష్కరించారు. బోర్లం రోడ్డులోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో స్వాతంత్య్ర వేడుకలకు హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలలోని వసతులను సద్వినియోగం చేసుకుంటూ చక్కగా చదువుకోవాలన్నారు. పాఠశాల, కళాశాలకు శాశ్వత భవన నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ ధనలక్ష్మి, వార్డెన్ రేష్మాబేగం, నాయకులు కాసుల రోహిత్, అలీబిన్ అబ్దుల్లా, ఖాలెఖ్, అసద్‌బిన్ మోసిన్, నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, జలీల్ పాల్గొన్నారు.

కౌలాస్ కోటకు పర్యాటక గుర్తింపు

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే

నిజాంసాగర్: కౌలాస్ కోటకు పర్యాటక గుర్తింపు తీసుకువస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. కౌలాస్ కోట ప్రాముఖ్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని, త్వరలోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతామన్నారు. జుక్కల్ మండలం కౌలాస్ కోటపై గురువారం ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. గత పాలకులు పర్యాటక ప్రాంతాలపై శ్రద్ధ చూపలేదన్నారు. సంగారెడ్డి- నాందేడ్ జాతీయ రహదారి పక్కనే కౌలాస్ కోట ఉండటంతో పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నాయకులు రమేష్‌దేశాయ్, అస్పత్‌వార్ వినోద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న వైద్య శిబిరం



మాచారెడ్డి : మండలంలోని లక్ష్మీ రావులపల్లిలో వైద్య శిబిరం కొనసాగుతోంది. గ్రామంలో డెంగీ సోకి పలువురు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం ఆశవర్కర్లు ఇంటింట సర్వే నిర్వహించారు. వైద్య శిబిరంలో 35 మందిని పరీక్షించినట్లు సీహెచ్ వో వెంకటేష్ తెలిపారు. లక్ష్మీరావులపల్లితో పాటు భవానీపేట, పాల్వంచ గ్రామాల్లో జ్వరాలు తగ్గుముఖం పట్టినట్లు ఆయన వివరించారు.

కాలనీల్లో విద్యుత్ దీపాలు సరిచేయాలి



బీబీపేట : మండలంలోని యాడారం గ్రామంలోని పలు కాలనీల్లో విద్యుత్ దీపాలు సరిచేయాలని కోరుతూ 'మన ఊరు మేం సైతం' ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి అఖిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1వ వార్డు, 2వ వార్డు, దేవాలయం నుంచి హరిజన వార్డుకు వెళ్లే దారిలో విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రావు, సుద్దాల రాజు, పిడుగు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



కామారెడ్డి క్రైం: పాల్వంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అభిలాష్ 21 సెకన్లలో 118 మూలకాల పేర్లను చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు. దీంతో గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో అభిలాష్‌ను ముఖ్య అతిథి పటేల్ రమేశ్‌రెడ్డి అభినందించారు.

ఇద్దరు అధికారులకు ఉత్తమ అవార్డులు

గాంధారి(ఎల్లారెడ్డి) : మండలం నుంచి ఇద్దరు అధికారులు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. జిల్లా తహసీల్దార్ తహీల్దార్ సతీష్‌రెడ్డి, ఎస్సై ఆంజనేయులు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. నాయకులు, మండల ప్రజలు వారిని అభినందించారు.

ట్రాన్స్‌కో డీఈపై చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ట్రాన్స్‌కో డీఈ హరిచంద్ అక్రమాలకు పాల్పడుతున్నాడని లైన్‌మన్ వీర్‌కుమార్ ఆరోపించారు. ఆర్మూర్ డివిజన్ కార్యాలయం ఆవరణలో గురువారం లైన్‌మన్ వీర్‌కుమార్ మాట్లాడారు. విద్యుత్ కార్మికులకు అనవసరంగా సస్పెండ్ చేస్తున్నారని, మెమోలు ఇస్తూ డబ్బులు అడుగుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డీఈని సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తానని అన్నారు. ఈవిషయమై డీఈ హరిచంద్‌ను వివరణ కోరగా లైన్‌మన్ చేస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో పోస్టింగ్ కోరిన చోట ఖాళీ లేకపోవడంతో విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలో అక్కడే ఇచ్చామన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి సమీపంలోని జాతీయ రహదారి వంతెన కింద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. మృతుడి వయస్సు 50 ఏళ్ల లోపు ఉంటుందని, అతనిపై తెలుపు రంగు షర్టు, తెలుపు రంగు దోతి ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712686170, 8712686172 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ప్రతిభకు పురస్కారం..

జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ఆయా శాఖల్లో ప్రతిభ చూపిన అధికారులకు తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేశ్ రెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు. – కామారెడ్డి క్రైం



మహాలక్ష్మి పథకం శకటం ప్రదర్శన



ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులుకు సేవా పథకాన్ని అందజేస్తున్న టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి



రాజు, డీఈవో, కామారెడ్డి | జార్జ్, ఎస్‌బీ సీఐ | సంతోష్‌కుమార్ సీఐ, సదాశివనగర్ | ఉస్మాన్, సీసీఎస్ ఎస్సై | రాజు, ఎస్సై, దేవునిపల్లి | ఆంజనేయులు, ఎస్సై, గాంధారి | శ్రీనివాస్, ఏఎస్సై, కామారెడ్డి | నర్సింలు, హెచ్‌సీ, డీపీవో | వెంకట్‌రెడ్డి, హెచ్‌సీ, ఎస్‌బీ | భూపాల్‌రెడ్డి, హెచ్‌సీ, ఏఆర్ | విశ్వనాథ్, పీసీ, కామారెడ్డి | సుబ్రహ్మణ్యచారి, ఏఎస్సై, దోమకొండ | నర్సింహారెడ్డి, ఏఎస్పీ

భావయ్య, ఐసీడీఎస్ పీడీ | దయానంద్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ | నిత్యానందం, ఏఎస్‌వో | రంగనాథ్, ఆర్డీవో, కామారెడ్డి | చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో | ఇందిర, డీఎం, ఆర్టీసీ | సుజాత, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి | జ్యోతి, సూపరింటెండెంట్ | మసూర్ అహ్మద్, ఏవో, కలెక్టరేట్ | ప్రేంకుమార్, తహసీల్దార్ | ఉమాలత, సూపరింటెండెంట్ | స్వప్న, సూపరింటెండెంట్ | సరళ, సూపరింటెండెంట్ | అనిల్, ఎలక్షన్ డీటీ

సంతోష్ రెడ్డి, సీ.అసిస్టెంట్ | హరీశ్, కలెక్టర్ సీసీ | సుఫియాన్, కలెక్టర్ సీసీ | రాజశేఖర్, అడిషనల్ కలెక్టర్ సీసీ | నర్సింహారెడ్డి, ఆర్ఐ | రాజ్‌కుమార్, హెచ్‌హెచ్‌పీ | తబస్సుమ్, ఏవో, అగ్రికల్చర్ | రాజశేఖర్‌రావు, ఆఫీస్ సబార్డినేట్ | సుధాకర్, ఐకేపీ డీపీఎం | విక్రమ్, ఎక్సైజ్ ఎస్సై | ప్రవీణ్, ఈడీఎం | సుగుణ, హెల్త్ సూపర్‌వైజర్ | మిథున్‌కుమార్, జూ.అసిస్టెంట్, పీఆర్ | శ్రీనివాస్, ఏపీఎం, ఐకేపీ



జిల్లా కేంద్రంలోని బీజేపీ ఆఫీస్‌లో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్, అరుణతార



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



విద్యుత్ శాఖ కార్యాలయంలో..



జిల్లా కేంద్రంలోని మెడికల్ అసోసియేషన్ ఆఫీస్‌లో..

జిల్లాకేంద్రంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఆయా పార్టీలు, కార్యాలయాలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. – కామారెడ్డి టౌన్

బెదిరించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని హజ్గుల్ మంజీరా ఒడ్డున ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలను ఇసుక ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపుతామని డ్రైవర్లు బెదిరించడంతో గురువారం వీఆర్ఏలు పోలీస్‌స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేశారు. 'సాక్షి'లో గురువారం 'ఇసుకాసురుల బెదిరింపులు' వచ్చిన కథనానికి రెవెన్యూ, పోలీసులు స్పందించి వీఆర్ఏలతో మాట్లాడారు. వీఆర్ఏలు మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకుంటుండగా హజ్గుల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు 8 మంది వచ్చి ట్రాక్టర్లతో ఢీకొట్టి చంపుతామని బెదిరించారని ఎస్సై మోహన్‌రెడ్డికి వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాము రాత్రి పగలు విధులు నిర్వహించాల్సి ఉంటుందని, హజ్గుల్‌లో ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులతో మాకు ప్రాణహాని ఉందని వారు వేడుకున్నారు. వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని సీఐ, ఎస్సైలను వీఆర్ఏలు వేడుకున్నారు. వారిపై కేసు నమోదు చేస్తానని పోలీసులు హామీ ఇచ్చారు.



సీఐ, ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న వీఆర్ఏలు

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



రుద్రూర్: మండలంలోని రాయకూర్ చెరువులో చేపల వేటకు వెళ్లిన ఎర్రోల్ల నారాయణ(38) అనే యువకుడు ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని మృతి చెందినట్లు ఏఎస్సై రాజు పేర్కొన్నారు. బుధవారం రాత్రి చేపల కోసం ఇంటి నుంచి వెళ్లిన నారాయణ తిరిగి రాలేదు. కుటుంబీకులు గురువారం చెరువులో వెతుకగా మృతదేహం లభించింది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) గ్రామానికి చెందిన కొలడి నర్సయ్య(76) అనే వృద్ధుడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై రాజు గురువారం పేర్కొన్నారు. ఈ నెల 13న నర్సయ్య చిక్కడపల్లి గ్రామానికి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమార్తె పాపవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

● భార్యాభర్తలకు గాయాలు



మాచారెడ్డి: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలైన ఘటన మండలంలోని ఘన్‌పూర్ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి, రేణుక దంపతులు పని నిమిత్తం కారులో కామారెడ్డికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో మండలంలోని ఘన్‌పూర్ శివారులోకి రాగానే కారు అదుపు తప్పడంతో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో కారులో ఉన్న భార్యాభర్తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరిపై దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రెండో టౌన్ పీఎస్ పరిధిలోని ఎంఐఎం కార్యాలయం ఎదుట ఇద్దరిపై కొందరు గురువారం దాడి చేశారు. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రెండో టౌన్ పరిధికి చెందిన ఎండీ జునేద్, ఎండీ అల్మాస్‌ఖాన్ బైక్‌పై ఎంఐఎం కార్యాలయ సమీపంలో వెళ్తుండగా అదే ప్రాంతానికి చెందిన సమీర్, అజార్, ఉమర్, కొంత మంది కలిసి దాడి చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై..

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై మనోజ్ గురువారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.18,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మోపాల్ డీటీ జగదీశ్వరి సరెండర్

మోపాల్: మోపాల్ తహసీల్ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరిని సరెండర్ చేసిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై తహసీల్దార్ రామేశ్వర్‌ను వివరణ కోరగా డీటీ జగదీశ్వరి చైల్డ్ కేర్ నిమిత్తం ఈనెల 6 నుంచి దీర్ఘకాలిక సెలవులో వెళ్లిందని, కార్యాలయంలో పనిభారంతో ఆమెను సరెండర్ చేస్తూ కలెక్టర్, ఆర్డీవోకు లేఖ రాసిన విషయం వాస్తవమేనన్నారు. అదే సమయంలో డీటీగా మరొకరిని కేటాయించాలని వారిని కోరినట్లు తెలిపారు.

అంగరంగ వైభవంగా..



ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న రమేశ్‌రెడ్డి



వేడుకలకు హాజరైన ప్రజలు

● కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో వేడుక

కామారెడ్డి క్రైం : 78 వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఉదయాన్నే కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ క్యాంప్, కలెక్టరేట్, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కామారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సింధు శర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్య్ర పోరాటంలో అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఏ ఎస్పీ నర్సింహా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్య శాఖ శకటం ప్రదర్శన



పాల్వంచ విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత



మాచారెడ్డి కేజీబీవీ విద్యార్థుల యోగా ప్రదర్శన



కేజీబీవీ విద్యార్థులను ప్రశంసిస్తున్న రమేశ్ రెడ్డి



ఇసాయిపేట ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



గంజ్ హైస్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన



జిల్లా సమాఖ్యకు చెక్కును అందజేస్తున్న దృశ్యం



రుణమాఫీ నిధుల చెక్కును అందజేస్తున్న దృశ్యం



జెడ్పీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సింధు శర్మ

ఢిల్లీ పరేడ్‌లో 'వాడి' వాసి వైద్య సేవలు

● వైకల్యాన్ని జయించి ఉన్నతంగా ఎదిగిన తీరు
● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవార్డులు అందుకున్న వైద్యుడు

ఆర్మూర్: వేల్పూర్ మండలం వాడి గ్రామానికి చెందిన డాక్టర్ గోలి శ్రీనివాస్ తనలోని వైకల్యాన్ని జయించి ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో వైద్య సేవలు అందించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గ్రామీణ ప్రాంతంలోని పేద కుటుంబానికి చెందిన గోలి శ్రీనివాస్ తన రెండో ఏటనే పోలియో బారిన పడటంతో కుడికాలు వైకల్యానికి గురైంది. అయినా మొక్కవోని ధైర్యంతో పదో తరగతి వరకు ఆర్మూర్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో, ఇంటర్ ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలలో చదివారు. కరీంనగర్‌లోని చల్మెడ ఆనంద్‌రావు మెడికల్ కళాశాలలో 2006లో మెడిసిన్ పూర్తి చేశారు. 2013–14లో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో, 2015లో ఢిల్లీలో సెంట్రల్ గవర్నమెంట్ నిర్వహిస్తున్న ప్రఖ్యాత సఫ్దర్ గంజ్ ఆస్పత్రిలో తన సేవలు అందించారు. 2015 యూపీఎస్సీ సెలక్షన్స్‌లో సీఎంసీ బ్యాచ్‌కు ఎంపికయ్యాడు. శిక్షణ అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) క్యాడర్ అలాట్ చేశారు. ఇంతకు ముందు కర్తవ్యపథ్(రాజ్‌పథ్)లో నిర్వహించిన భారత రిపబ్లిక్ డే 2023–24 ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి, ప్రధాని పాల్గొన్న వేడుకల్లో భారత రక్షణ బలగాలు, పోలీసు సిబ్బంది, వివిధ రాష్ట్రాలకు చెందిన పరేడ్‌లో పాల్గొన్న వారికి వైద్య సేవలందించాడు. 2022–23లో ఎర్రకోటలో నిర్వహించిన భారత స్వాతంత్య్ర వేడుకల్లో కూడా స్వచ్ఛందంగా మెడికల్ టీంకు నాయకత్వం వహించడంతోపాటు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ క్యాడర్ అభ్యర్థులకు మూడేళ్లుగా ఫిజికల్ టెస్టుల్లో కూడా స్వచ్ఛందంగా మెడికల్ సేవలందించాడు. కోవిడ్ సమయంలో కూడా తన వైకల్యాన్ని అధిగమించి నిర్విరామంగా అందించిన వైద్య సేవలందించారు. సఫాయి కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడం లాంటి సేవలకు గాను కేంద్ర ప్రభుత్వంతో పాటు ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ అవార్డులు అందుకున్నారు.



ఎర్రకోట వద్ద వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

గర్వంగా ఉంది



గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి దేశ రాజధానిలో రాష్ట్రపతి, ప్రధాన మంత్రి లాంటి ముఖ్యులకు వైద్య సేవలు అందించే వైద్య బృందానికి నాయకత్వం వహించడం గర్వంగా ఉంది. ఇది నా ఒక్కడి విజయం కాదు. గ్రామీణ ప్రాంతానికి చెందిన నాకు సహాయ సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరి విజయంగా భావిస్తున్నాను.
– డాక్టర్ గోలి శ్రీనివాస్, వాడి, వేల్పూర్ మండలం

యాప్ ప్రారంభోత్సవంలో క్యాసంపల్లి వాసులు

కామారెడ్డి అర్బన్: నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్) యాప్‌ను న్యూఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్ చౌహాన్ గురువారం ప్రారంభించగా హైదరాబాద్ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. దీంట్లోభాగంగా కామారెడ్డి క్యాసంపల్లి రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాప్ ద్వారా పంటల్లో పురుగు నివారణ ఎలా చేయాలనే విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏ అపర్ణ, ఏవో శ్రీనివాసరావు, టెక్నికల్ ఏవో నర్సింలు, ఏఈవో తేజస్విని, అధికారులు తదితరులున్నారు.